క్లుప్తంగా

సంక్రాంతి ముగ్గుల పోటీ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని వివేకనందా విగ్రహం వద్ద శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు మహిళలు ఆసక్తిగా పాల్గొని రంగువల్లులు వేశారు. అనంతరం మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు జయప్రకాష్, విజయశేఖర్, బాలాజీ, గుణశేఖర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఐరాల: మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఆసరగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పుత్రమద్దికి చెందిన డి.సురేష్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. ఈ క్రమంలో శనివారం చెక్కును మృతుడి భార్య సుమతికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, విశ్రాంత ఆర్ఐ జయచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

పూతలపట్టులో వికసిత్ భారత్



గ్రామస్తుడికి క్యాలెండర్ అందజేస్తున్న ఎంపీడీఓ

పూతలపట్టు : మండలంలోని పేట అగ్రహారం, పోలవరం, గొడుగుచింత, పోటుకనుమ పంచాయతీల్లో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రోన్‌తో పొలాల్లో మందుల పిచికారీ చేయడాన్ని చూపించారు. ఎంపీడీవో గౌరీ, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఏవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, నాయకులు నిరంజన్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్రబృంద సభ్యులు

యాదమరి : మండలంలోని వరదరాజులపల్లెలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం జాతీయ నాణ్యతా పరిమాణాల బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు అన్ని పరికరాలు సమకూర్చిందన్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం వైద్యులు అర్జిత్ బెనర్జీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

15న మకరజ్యోతి దర్శనం



సదుం: అయ్యప్ప ఆలయం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 15న మకరజ్యోతి దర్శనాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు గ్రామంలోని సదుమమ్మ ఆలయంలో స్వామివారి తిరు ఆభరణాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వాటిని ఊరేగింపుగా తీసుకువచ్చి అయ్యప్ప ఆలయానికి సమర్పించనున్నారు. సాయంత్రం ఆలయ సమీపంలోని కొండల్లో మకరజ్యోతి దర్శనం ఇవ్వనుంది. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

కాణిపాకం(యాదమరి)/తవణంపల్లె : నాయకులు అందరూ కలిసి పనిచేసి వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కోరారు. ఆయన శనివారం ఉదయం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. అంతకుముందు ఆయనకు కాణిపాకం రోడ్డులోని నారాయణాద్రి కల్యాణ మండపం వద్ద వైఎస్సార్ సీపీ తవణంపల్లె మండల అధ్యక్షుడు హరిరెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న అందించిన పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి, రాయలసీమ స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ చైర్మన్ శైలజాచరణ్ రెడ్డి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజ, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, మండల కన్వీనర్లు హరిరెడ్డి, రామచంద్ర రెడ్డి, బుజ్జిరెడ్డి, చిన్నారెడ్డి, రవిరెడ్డి, సుధీర్, దొరబాబు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్, సర్పంచ్

నేటి నుంచి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛ తీర్థం

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం నుంచి 19వ తేదీ వరకు స్వచ్ఛ తీర్థం కార్యక్రమంలో భాగంగా సేవా కార్యక్రమాలు చేపటనున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఇందులో ఆలయ అధికారులు ఆలయ మాడ వీధులు, ప్రధాన దేవాలయం, కోనేరు, బస్టాండు, లడ్డూ పోటు, అన్నదాన సత్రం, వినాయక సదన్, కల్యాణ కట్ట, డార్మిటరీ తదితర ప్రాంతాలను శుద్ధి చేస్తారని పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఇరువారం వద్ద శనివారం టూటౌన్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించామని సీఐ ఉలశయ్య తెలిపారు. ఈ దాడుల్లో రూ.10,200 సీజ్ చేశామన్నారు. 8 మంది జూదరులను అరెస్ట్ చేశామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషి చేస్తున్నామని ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్ అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లడారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలపై స్పందిస్తున్నారని చెప్పారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నియమావళిని పాటిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలు నడిపే వేగం తగ్గిందన్నారు. ముఖ్యంగా యువతకు అధిక వేగంతో బండి నడపడం వద్దన్నారు. రోడ్డు ప్రమాదానికి గురి కాకుండా కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. చిత్తూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ప్రారంభించనున్నామని ఆయన చెప్పారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎస్ఐలు బాబు, జయప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన వ్యక్తి

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ భారతి తెలిపారు. వివరాలు ఇలా.. మిట్టూరులో కాపురం ఉంటున్న ప్రభాకర్ (36) బేకరీ షాపు నిర్వహిస్తున్నాడు. అయి తే అప్పులు ఎక్కువ కావడంతో ఈనెల 11వ తేదీ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా, అతడి ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

వినాయకుని సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి

కాణిపాకం(యాదమరి) : కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శనివారం ఉదయం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జడ్జికి స్వామి వారి చిత్ర పటం అందజేస్తున్న ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

హెచ్‌ఎంలకు ట్యాబ్‌ల అందజేత



హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవోలు



ట్యాబ్‌లతో విద్యార్థులు

ఐరాల: మండలంలోని కాణిపాకం, పాలకల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలకు శనివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ట్యాబ్‌లు అందజేశారు. పాలకల పాఠశాలకు 42, కాణిపాకం పాఠశాలకు 116 ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు ఎంఈవోలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు తెలిపారు. మొదటి దఫా ఈ రెండు పాఠశాలలకు ట్యాబ్‌లు రానందున పంపిణీ చేయలేకపోయామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేస్తున్నారని, వాటితో విద్యార్థులు ప్రతిభ చూపుతారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చంద్రశేఖర్‌నాయుడు, శాంతకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

యాదమరి : మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ఎంఈవో రుక్మిణి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకాచారి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



గుడిపాల: ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. శనివారం గుడిపాల మండలంలోని రామభద్రాపురం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

తవణంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్యం అందజేస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు, వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ పూజిత తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం చారాల, ఎగువ వెంకటాపురం, కారకాంపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. గర్భిణులు, రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు.



కారకాంపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



చారాలలో ..

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి పంచాయతీకి చెందిన సుమారు 150 మంది భక్తులు శనివారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ప్రతి సంవత్సరం కాలినడకన తిరుమల చేరుకుని స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు. ఇందులో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శంకరప్ప, మాజీ సర్పంచ్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



పుంగనూరులో బ్రాహ్మణ వధూవరుల పరిచయ పోస్టర్లను విడుదల చేస్తున్న శేషగిరిరావు, రామమూర్తి

పుంగనూరు: తిరుపతి పట్టణంలోని ఇస్కాన్ మందిరం రోడ్డులో ఉన్న కంచి కామకోటి పాదుకా మఠంలో ఈ నెల 28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు బ్రాహ్మణ సంఘం నాయకులు శేషగిరిరావు, కాసల నాటి రామమూర్తి తెలిపారు. వారు శనివారం పుంగనూరులో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గాయిత్రీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 32వ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ వధూవరులు తమ పూర్తి వివరాలతో పరిచయ వేదికలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు మధు, కృష్ణమూర్తి, గిరి, శ్రీనివాసరావు, రమణరావు, అశ్వర్థనారాయణ, మల్లికార్జున, ప్రణీత్, రాజేష్, మహేష్, పవన్, విహారి, వినోద్‌అర్ష పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINICIPAL SENIOR CIVIL JUGE OF CHITTOOOR
O.E.P.No. 06 of 2016
O.S.No. 291 of 2007

Between: **V.Yugandhar** ....Decree Holder
And. **1.B.K.Vijay Kumar(died)**
2.B.K.Chittemma,W/o Late B.Krishnama Naidu
3.B.V.Dhrakshayani, W/o Late B.K.Vijaya Kumar
4.K.B.Vamseekrishna S/o Late B.K.VijayaKumar
5.K.B.V.Swetha, D/o Late B.K.Vijaya Kumar
6.B.V.Muralikrishna, S/o Late B.K.Vijaya Kumar
Nos.2 to 6 are Hindus,Cultivations and business,, residents of Gunthur Village,G.K.V.Vandla Vooru,Bangarupalyam Mandal, Chittoor District. ..Judgement-debtors

AUCTION NOTICE

The above **E.P.06/2016** stands posted to **08.02.2024** for sale of the below mentioned property of B.K.Vijayakumar and the J.Drs 2 to 6 being legal representatives of B.K.Vijaya Kumar are the title holders. It is situate in No.170 Gollapalle Gram Panchyat and Revenue Village accounts and the schedule property will be auctioned in the above Court premises at **10-30 A.M on wards on 08-02-2024** for realization of the Decree amount and the intending bidders can participae in the auction on the same day.

SCHEDULE

Chittoor District-Bangarupalyam Sub District- Bangarupalyam Mandal-170 Gollapalle Gram Panchayat and Village accounts- House property - 2 Blocks of small residential house of 8 units in each block constructed with Mangalore Tiled roofing bearing D.Nos. 1-221 to 1-228 and 1-235 to 1-242. Houses are situate in the site
Site Measuring : East- West :128 feet, North- South : 88 feet
Bounded by :- East: Site of Peddabba Naidu and 2 others, West: Medara Street(BKN Street), South: Houses of L.Chandraiah and Lokaiah Naidu, North: Houses of Bhaskar Naidu and Doraswamy Naidu
Total Property - D.Hr. Value Rs.10,00,000/-
Total Property - Field Assistant Value of Rs.90,11,200/-
In this 2/9th undivided share of J.Drs 1 and 2 is for Sale
E.C:NIL

Place:Chittoor **Sd/-D.RAJENDRA REDDY**
Date:12-01-2024 Advocate for D.Hr

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

భక్తి ప్రపత్తులతో గోవిందనామ సంకీర్తన

తిరుపతి కల్చరల్: ధనుర్మాసంలో చివరి శనివారం వేకువజామున రంగస్థలి కళాకారులు భక్తిశ్రద్ధలతో శ్రీగోవిందరాజ స్వామి మాడ వీధుల్లో శ్రీగోవిందనామ సంకీర్తనతో సంచారం చేశారు. ఈ సందర్భంగా రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా చేపట్టిన గోవిందనామ సంకీర్తన సంచారాన్ని ఒక ప్రతి శనివారం నిర్వహిస్తూ తద్వారా నగర ప్రజల్లో భక్తి భావాన్ని పెంచేందుకు కృషి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రంగస్థలి కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పాలసముద్రం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటను సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం అవసరం ఉండదని, జీవామృతం కాషాయాలతో సాగు చేయండంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎన్ఎఫ్ఎంటీ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం శ్రీకావేరి రాజుపురంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేయడంతో ద్వారా చీడపీడల సమస్య ఉండదని, అధిక దిగుబడుల కోసం జీవామృతం వాడాలన్నారు. కలుపు నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేసి, తద్వారా ఉత్పత్తయ్యే బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామన్నారు. రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదు శాతం ఎక్కువ టీటీడీ కొనుగోలు చేస్తామని తెలిపారు. అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పీఆర్పీ ఉష, ఐసీఆర్‌పీ ప్రతాప్, మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించి ర్యాలీ చేస్తున్న రైతులు

